

ఎస్సీ సంక్షేమశాఖ అధికారి యాదయ్యను సన్మానిస్తున్న కలెక్టర్

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి పెరిక యాదయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 34 ఏళ్లపాటు ఎస్సీ సంక్షేమ శాఖలో పనిచేసి యాదయ్య నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, పదవీవిరమణ సాధారణమన్నారు. నిబద్ధతతో పనిచేసే అధికారులు చిరకాలం గుర్తుంటారని ఆయన పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు యాదయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కదిరివన్, ముకుందరెడ్డి, వెంకటాచారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జంగిల్ థీమ్ ఈవెంట్‌లో వివిధ రకాల వేషధారణల్లో చిన్నారులు

జంగిల్ థీమ్ ఈవెంట్‌లో చిన్నారుల సందడి

ఎర్రగడ్డ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన జంగిల్ థీమ్ ఈవెంట్‌లో చిన్నారులు అలరించారు. ఉత్సాహభరితమైన అలంకరణలో ఇంటరాక్టివ్ కార్యక్రమాలతో అడవికి జీవం పోస్తున్నట్లుగా నర్సరీ విద్యార్థులు సరదాగా గడిపారు. వివిధ రకాల జంతువుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఫౌండర్ సీఈవో ఏ.మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి వినియోగదారుల అరెస్ట్

యూసుఫ్‌గూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బీకేగూడ ఎల్ఐసీ కాలనీకి చెందిన ఎస్.వివేక్‌గౌడ్ (21), వెంగళరావు నగర్‌కు చెందిన ఎండీ మహబూబ్ ఆలీ సాబేర్ (22) ఆదివారం రాత్రి సిద్ధార్థనగర్‌లోని ఆల్ఫాన్సా స్కూల్ సమీపంలో గంజాయి తాగుతున్నారు. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా గంజాయి తాగుతున్నట్లు తేలింది. ఫతేనగర్‌లో రూ.400లకు గంజాయి కొనుగోలు చేసినట్లు వారు వెల్లడించారు. వారి వద్ద ఉన్న గంజాయి, ఫోన్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

యూసుఫ్‌గూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఊరు వెళ్లి వచ్చేలోపు ఇంట్లో చోరీ జరిగిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సిద్ధార్థనగర్‌లో ఉంటున్న కె.గణేష్ గత నెల 12న భార్య ప్రసవం కావడంతో తన కుమారుడితో పాటు కాకినాడ వెళ్లాడు. ఈ నెల 1న ఉదయం తిరిగి రాగా బీరువా పగులగొట్టి ఉంది. అందులో ఉండాల్సిన పట్టీలు, కుంకుమ భరిణిలు, పిల్లల ప్లేట్లు మొత్తం రూ.50 వేల విలువ చేసే వస్తువులు కనిపించడం లేదని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితురాలి పేరుతో మెసేజ్ చేసి రూ.25 వేలు కొట్టేశారు

బంజారాహిల్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డబ్బు అవసరం ఉందంటూ స్నేహితురాలి పేరుతో మెసేజ్ చేసి సైబర్ నేరగాళ్లు రూ.25 వేలు కాజేశారు. శ్రీనగర్‌కాలనీకి చెందిన రుబేల్ అగర్వాల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. గత నెల 13న స్నేహితురాలు స్వాతి పేరుతో ఓ మెసేజ్ వచ్చింది. రూ.35 వేలు కావాలని తాను చెప్పిన నంబర్‌కు పంపించాలని కోరడంతో రుబేల్ అగర్వాల్ మొదట 25 వేల రూపాయలు పంపించాడు. కొద్ది సేపటికి అదే నంబర్ నుంచి అతడి ఫోన్ హ్యాక్ అయిందని మెసేజ్ వచ్చింది. మోసపోయినట్లు గ్రహించిన రుబేల్ సైబర్ వింగ్‌కు ఆన్‌లైన్‌లో సమాచారం ఇచ్చాడు. అనంతరం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్చరీ విజేత చికితారావు



చికితారావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఆర్చరీ సంఘం నిర్వహించిన అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్‌లో కాంపౌండ్ విభాగంలో చికితారావు విజేతగా నిలిచింది. కొల్లూర్ డీపీఎస్‌లో జరిగిన ఈ పోటీల్లో చికిత 690 పాయింట్లతో అగ్రస్థానం సొంతం చేసుకోగా, మానస 683 పాయింట్లతో రజతం, మన్సురాహ కాంస్య పతకాలు సాధించారు. పురుషుల్లో శివ సాయి, సాయి సుశాంత్, రాజేందర్ తొలి మూడు స్థానాల్లో నిలిచి సత్తా చాటారు. ఈ పోటీల్లో పతకాలు నెగ్గిన క్రీడాకారులు తెలంగాణ తరపున జాతీయ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు.

కామన్వెల్త్ కరాటేలో హైదరాబాదీల సత్తా



పతకాలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జరుగుతున్న కామన్వెల్త్ కరాటే చాంపియన్‌షిప్‌లో ముగ్గురు హైదరాబాదీలు పతకాలు కొల్లగొట్టారు. రామినేని రోహన్ (63 కిలోలు) క్యాడెట్ విభాగంలో స్వర్ణం, అమ్రాది విశాల్ రెడ్డి (57 కిలోలు) క్యాడెట్ విభాగంలో కాంస్యం, తాళపత్రి ఆరాధ్య (42 కిలోలు) కుమిటేలో స్వర్ణ పతకాలు సాధించారు. టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కరాటే సంఘం అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, కోచ్ నరేష్ ముదావత్ ఈ ముగ్గురు క్రీడాకారులను అభినందించారు.

టీటీ చాంప్ తరుణ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ లీగ్ చాంపియన్‌షిప్‌లో బాలుర అండర్-19 విభాగంలో కె.తరుణ్ టైటిల్ సాధించాడు. సికింద్రాబాద్‌లోని గుజరాతి సేవా మండల్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరిగిన ఈ పోటీల్లో బాలుర విభాగం ఫైనల్లో కె.తరుణ్ 3-2తో రిషబ్ సింగ్‌పై గెలిచాడు. బాలికల కేటగిరీ ఫైనల్లో పాలక్ గాయ్ 3-1తో శ్రీశాన్విపై నెగ్గింది. రాష్ట్ర టీటీ సంఘం మెంటర్ ప్రకాష్‌రాజ్, ప్రధాన కార్యదర్శి పి.నాగేందర్ రెడ్డి విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

పోటీ పరీక్షల అభ్యర్థులకు అండగా..!

● యువతకు చేయూతనిస్తున్న రహ్మత్‌నగర్ గ్రంథాలయం
● పాఠకులకు అవసరమైన పుస్తకాలను సమకూరుస్తున్న లైబ్రేరియన్



రహ్మత్‌నగర్ గ్రంథాలయం

యూసుఫ్‌గూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం గ్రంథాలయాలకు వెళ్లేవారి సంఖ్య తగ్గిపోతుండటంతో చాలా గ్రంథాలయాలు కనుమరుగయ్యాయి. మరికొన్ని కేవలం వార్తాపత్రికలతో నామమాత్రంగా నడుస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు సీఏ వంటి ప్రత్యేక కోర్సులకు సన్నద్ధమయ్యే వారు స్టడీ రూంలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే రహ్మత్‌నగర్‌లోని గ్రంథాలయం మాత్రం పాఠకుల మన్ననలు పొందుతోంది. ఈ గ్రంథాలయంలో అటు పుస్తక ప్రియులకు, ఇటు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 10వేలకు పైగా పుస్తకాలతో



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న యువత

పాటు ప్రతిరోజూ 14 వార్తాపత్రికలు పాఠకులకు అందుబాటులో ఉంటాయి. ప్రతినెలా 22 మ్యాగ్జైన్‌లు వస్తాయి. ఆధ్యాత్మికత, జీవితచరిత్రలు, యోగా, సాహిత్యం, ఆయుర్వేదం.. ఇలా అనేక రకాల పుస్తకాలతో గ్రంథాలయం పాఠకులను అలరిస్తుంది. దీంతో ఇక్కడికి సాధారణ రోజుల్లో 60 నుంచి 70 మంది వరకు.. శని, ఆదివారాలలో 80 నుంచి 120 మంది వరకు వస్తున్నారు

పోటీ పరీక్షల అభ్యర్థులకు ప్రత్యేక గది

రహ్మత్‌నగర్ చౌరస్తాలోని గ్రంథాలయం పెద్ద విశాలమైనదేమి కాదు. ఉన్నదానిలోనే ఒక గదిని పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే యువతకు కేటాయించారు. హాలులో సాధారణ పాఠకులు పేపర్‌లు, మ్యాగ్జైన్‌లు చదవడం చేస్తుంటారు. ఈ సమీపంలో ఎక్కడా గ్రంథాలయం లేకపోవడంతో ఆసక్తి ఉన్న పాఠకులు ఇక్కడికే వస్తుంటారు. ఇక బస్తీలలో ఉన్న యువత పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు ఈ గ్రంథాలయం ఎంతో అనుకూలంగా ఉంది. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు.. సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఇది అందుబాటులో ఉంటోంది. ఇటీవల గ్రూప్స్‌తో పాటు పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్ రావడంతో అభ్యర్థుల కోసం కొత్తగా 270 పుస్తకాలు తెప్పించి అందుబాటులో ఉంచారు. ఎవరైనా సమీపంలోని యువత పోటీపరీక్షలకు ప్రిపేర్ కావాలనుకుంటే ఈ గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి.

యువతకు చేయూత ఇస్తున్నాం



ఈ గ్రంథాలయంలో 12 ఏళ్లుగా లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నా. పాఠకుల అభిరుచికి తగ్గట్టుగా పుస్తకాలు సమకూరుస్తుంటాం. ముఖ్యంగా యువతకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో పోటీ పరిక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి అన్నిరకాల పుస్తకాలను కొనే స్తోమత ఉండదు. అలాంటి వారికి ఈ గ్రంథాలయం అండగా నిలుస్తోంది. ఏమైనా కొత్త పుస్తకాలు అవసరమైతే గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.పద్మజ దృష్టికి తీసుకెళ్తే ఆమె సాధ్యమైనంత త్వరగా ఆయా పుస్తకాలను అందుబాటులోకి తెస్తారు.

- ఎస్.శ్రీనివాస్, లైబ్రేరియన్

కావాల్సిన పుస్తకాలను సమకూర్చారు



నేను గ్రూప్-2కు ప్రిపేర్ అవుతున్నాను. ఈ గ్రంథాలయానికి వచ్చి అడిగితే అన్నిరకాల పుస్తకాలు ఉన్నాయని చెప్పారు. మరికొన్ని కావాలని అడగ్గా వాటిని కూడా తెప్పించారు. నాకు ఈ గ్రంథాలయం చాలా ఉపయోగపడుతోంది. ఇంటికి దగ్గరగా ఉండటంతో ఉదయం, సాయంత్రం వచ్చి చదువుకుంటున్నా. నాలుగు నెలల నుంచి రోజూ వస్తున్నా.

- డి.సుభాషిణి, రహ్మత్‌నగర్



అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యల గురించి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన

‘అంగన్‌వాడీ’లో సమస్యలను పరిష్కరించాలి

అమీర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్ పరిధిలోని బీకేగూడ కమ్యూనిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ సెంటర్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన కోరారు. సోమవారం తన అనుచరులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ప్రసూన వసతులను పరిశీలించారు. గత 9 సవంత్సరాలుగా ఈ సెంటర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేసిన ఆమె రూ.20 వేలకు పైగా బిల్లు పెండింగ్‌లో ఉండడం గమనించి మొదటి విడతగా రూ.6 వేలు చెల్లిస్తానని హామీ ఇచ్చారు. చిన్నారులకు మూత్రశాలలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామని చెబుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శించారు. వెంటనే అధికారులు స్పందించి ఈ కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలన్నారు.

గవర్నర్ దత్తత కాలనీలో డ్రైనేజీ సమస్యలు



ఖైరతాబాద్ ఇందిరానగర్‌లో పొంగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్

ఖైరతాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ దత్తత తీసుకున్న ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితం గవర్నర్ స్వయంగా కాలనీకి వచ్చి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా 18 బ్లాకుల్లో ఉన్న 324 ఇళ్లను దత్తత తీసుకున్నారు. గవర్నర్ ఆదేశాల మేరకు ఓ సంస్థ ఇక్కడి సమస్యలను గుర్తించి నివేదిక అందజేసింది. అయితే దాదాపు రెండు నెలలు దాటినా ఇక్కడ డ్రైనేజీ సమస్యలు అలాగే ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్తయ్య కిరాణా దుకాణం సమీపంలో డ్రైనేజీ ప్రతిరోజూ పొంగుతూనే ఉంటుంది. ఇక్కడ తాగునీరు వదిలిన ప్రతిసారీ డ్రైనేజీ మ్యాన్ హోల్ నుంచి మురుగు పొంగి రోడ్డుపై నిలిచిపోతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడే ఉన్న ఓ పాఠశాలలో చదివే విద్యార్థులు డ్రైనేజీ మురుగు నీటి గుండా వెళ్లాల్సిన పరిస్థితి. కాలనీలోని బ్లాక్ నంబర్లు 2, 6, 9, 10, 13, 18లలో ఎప్పుడూ డ్రైనేజీలు పొంగుతూనే ఉంటున్నాయి. అయితే గవర్నర్ దత్తత తీసుకున్న తర్వాత ప్రధాన సమస్యగా ఉన్న డ్రైనేజీ సమస్యకు వెంటనే పరిష్కారం లభిస్తుందని అందరూ భావించినా ఆ పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు. గవర్నర్ దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎన్టీఆర్ మార్గ్‌లో ప్రజా విజయోత్సవాల సందర్భంగా అలంకరించిన దృశ్యం

ప్రజా విజయోత్సవాల కాంతులు

ఖైరతాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పర్యాటక ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సచివాలయం, అసెంబ్లీ, ప్రధాన మున్సిపల్ కార్యాలయం, ఖైరతాబాద్ జోనల్ కార్యాలయాలతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలను అందంగా ముస్తాబు చేశారు. ఎన్టీఆర్ మార్గ్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లతో పాటు హుస్సేన్‌సాగర్ ప్రహరీకి విద్యుత్ దీపాలను అమర్చడంతో చూడముచ్చటగా కనిపిస్తున్నాయి. రాత్రి సమయంలో రోడ్లపై వెళ్లేవారికి ఆహ్లాదకర వాతావరణం అందుతోంది. దీంతో పాటు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఫ్లైఓవర్ల గోడలపై వేసిన పెయింటింగ్‌లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.



హెచ్ఐవీ నియంత్రణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న వివిధ ఆస్పత్రులకు చెందిన వైద్యులు, సిబ్బంది

హెచ్ఐవీపై అందరికీ అవగాహన ఉండాలి

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి

ఎర్రగడ్డ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదని, నివారణ ఒక్కటే మార్గమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని వివిధ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది సోమవారం ఎర్రగడ్డ చెస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో హెచ్ఐవీ మహమ్మారిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. 2010 నుంచి ఈ కార్యక్రమం ద్వారా హెచ్ఐవీ సంబంధిత మరణాలను 80 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుందని.. ఇప్పటి వరకు కొత్త రోగుల సంఖ్య 32 శాతం తగ్గిందని ఆయన పేర్కొన్నారు. హెచ్ఐవీపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, ప్రతి ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



ఎర్రగడ్డ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని డాన్ బాస్కో స్కూల్‌లో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1988లో స్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఒకేచోట కలుసుకుని ఆనందంగా గడిపారు విద్యార్థి దశలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 36 ఏళ్ల తర్వాత స్నేహితులు కలవడంతో వారంతా ఎంతో సంతోషించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆంథోనీ, సుధాకర్, సాలమన్ రాజు గౌడ్, హెచ్.సుభాష్, సంధ్యారాణి, టి.గిరిధర్, వెంకట్, ఆశాలత, మొహమ్మద్ షఫీయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని వెంబడించి నగదు లాక్కెళ్లిన వారి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

బేగంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని వెంబడించి నగదు లాక్కొని ఉడాయించిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గోపాలకృష్ణమూర్తి వివరాలను వెల్లడించారు. రసూల్‌పురాలోని కుమార్ వేలు బ్రదర్స్ సంస్థలో మెగావత్ కృష్ణ మేనేజరుగా పనిచేస్తున్నాడు. సంస్థ కార్యాలయం ఎదురుగా రసూల్‌పురాకు చెందిన సాయిరాం (23) టీ షాపు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాడు. మెగావత్ కృష్ణ నిత్యం నగదు తీసుకెళ్తుండటాన్ని గుర్తించిన సాయిరాం తన స్నేహితులైన ఉప్పల్‌కు చెందిన శ్రీహరి (23), లోకేష్ (18)కు సమాచారం ఇచ్చాడు. దీంతో ముగ్గురు కలిసి నగదు కాజేసేందుకు పథకం రచించారు. గత నెల 26న ఉదయం రూ.2.13 లక్షలు తీసుకొని బ్యాంకు వద్దకు వెళ్తున్న మెగావత్ కృష్ణను వెంబడించారు. మాస్కులు ధరించి నంబర్ లేని బైక్‌పై వెండించిన శ్రీహరి, లోకేష్ ఆనంద్ టాకీస్ సమీపంలో నగదు ఉన్న బ్యాగ్ లాక్కొని పారిపోయారు. దీంతో బాధితుడు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను గుర్తించిన పోలీసులు చిలుకానగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. దోపిడీకి సూత్రధారి అయిన సాయిరాంను సైతం అరెస్ట్ చేశారు.

ఆయుర్వేద కళాశాలలో పర్యావరణంపై అవగాహన



విద్యార్థినికి జూట్‌బ్యాగ్‌ను అందజేస్తున్న ప్రసన్నకుమార్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వాహనాల వినియోగం కాలుష్య నివారణకు దోహదం చేస్తుందని సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ డబ్ల్యు.జి ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా ఎర్రగడ్డలోని బీఆర్‌కేఆర్ ఆయుర్వేద కళాశాలలో విద్యార్థులకు, ఆచార్యులకు పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. మానవ ఆరోగ్యంపై వాహన కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతోందని, వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి స్థిరమైన పద్ధతులను అవలంబించాలన్నారు. పర్యావరణ అనుకూల సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ఇంధన, నీటి సంరక్షణతో పాటు పాత పరికరాలను రీసైక్లింగ్ చేయడం వంటి పద్ధతులను సమాజంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఆయుర్వేద కళాశాల వైద్యుడు ఉపుల్ మాట్లాడుతూ.. వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు చెట్లు, పూలు ఉపకరిస్తాయన్నారు. ఉసిరి, మూరింగ, పొద్దుతిరుగుడు వంటి వాటితో పాటు ఔషధ ప్రయోజనాల కోసం ఉపయోగించే కొన్ని మొక్కలు సైతం కాలుష్యాన్ని తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. వేప, భారతీయ వెదురు, తులసి వంటి మొక్కలు నీటి నుంచి కాడ్మియం, లెడ్, ఆర్సెనిక్ క్రోమియం వంటి భారీ లోహాలను గ్రహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయన్నారు.



వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించాలి

బౌద్ధనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించాలని ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్, చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాసులు సూచించారు. సోమవారం ఆలుగడ్డబావి జంక్షన్ వద్ద హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వాహదారులకు వారు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలను నడపటం వల్ల పలువురు ప్రమాదాలు బారిన పడుతున్నారని, మరికొందరు చనిపోతున్నారని అన్నారు. రాంగ్ సైడ్‌లో వాహనాలను నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లేజర్‌గన్‌లను ఏర్పాటు చేశామని, పరిమితి మించి నడుపుతున్న వాహనాలను లేజర్‌గన్‌లతో వేగాన్ని పర్యవేక్షించి చలానాలు జారీ చేస్తామని తెలిపారు. కార్లు 60కిలోమీటర్లు, బైక్, ఆటోలు, బస్సులు గంటకు 50 కిలోమీటర్ల వేగంలోపు వెళ్లాలని, లేనిపక్షంలో లేజర్‌గన్‌లతో వేగాన్ని పర్యవేక్షించి చలానాలను వేస్తామని తెలిపారు.



ఫుట్‌పాత్‌లపై అనాథలకు దుప్పట్లను అందజేస్తున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

అనాథలకు దుప్పట్ల పంపిణీ

అడ్డగుట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చలితో సతమవతమవుతూ ఫుట్‌పాత్‌లపై కాలం వెల్లదీస్తున్న అనాథలు, యాచకులకు నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు సోమవారం దుప్పట్లను పంపిణీ చేశారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, చిలకలగూడ చౌరస్తా, సికింద్రాబాద్ రోడ్డు మార్గంలోని ఫుట్‌పాత్‌లపై రాత్రి సమయంలో నిద్రిస్తున్న అనాథలు చలికి తట్టుకోలేకపోతున్నారని, దీంతో వారికి దుప్పట్లను పంపిణీ చేశానని ఏసీపీ తెలిపారు.



సమస్యలపై స్థానికులు, అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ హేమ

స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనుల పరిశీలన

బౌద్ధనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్‌కాలనీ రోడ్డునెంబర్1 నుంచి 5వరకు చేపడుతున్న స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులను సోమవారం కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ పరిశీలించారు. సుమారు రూ.70లక్షల వ్యయంతో ఈ పనులను చేపట్టామని, సంవత్సరం క్రితం ఈ పనులకు నిధులకు మంజూరు అయ్యాయని, వర్షాలు, ఎన్నికల నేపథ్యంలో ఈ పనులకు అంతరాయం ఏర్పడిందని కార్పొరేటర్ తెలిపారు. అనంతరం సమస్యలపై స్థానికులు, అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, కాలనీవాసులు నగరపు శ్యామ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పెట్టవద్దు

డీసీపీ కవిత



మాట్లాడుతున్న డీసీపీ కవిత

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎట్టిపరిస్థితుల్లో నూ ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, ఇది సైబర్‌నేరగాళ్ల చేతికి చిక్కి దుర్వినియోగం అయ్యే అవకాశముందని సైబర్ క్రైం డీసీపీ కవిత దార అన్నారు. కింగ్‌కోఠిలోని సెంట్ జోసఫ్ డిగ్రీ, పీజీకళాశాలలో సోమవారం వరల్డ్ కంప్యూటర్ లిటరసీ డే సందర్భంగా హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సహకారంతో 'డిజిటల్ కేర్ హబ్' పేరుతో సైబర్ సెక్యూరిటీ సెల్‌ను ప్రారంభించారు. డిజిటల్ సేఫ్టీపోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న సైబర్‌వేధింపులు, ఆర్థికనేరాలు, ఆన్‌లైన్ డెలివరీ మోసాలు, ఫిషింగ్, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల గురించి వివరించారు. సైబర్‌నేరాలు జరుగుతున్న తీరుపై అవగాహన పెంచుకోవాలని, బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ హెడ్ ఎం.కిరణ్‌జ్యోతి, అదనపు ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.శ్రీకాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఆంటోని సాగయరాజా, హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ శీమాసిక్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్రోఫీలతో క్రీడాకారులు

టీటీ చాంప్ తరుణ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ లీగ్ చాంపియన్‌షిప్‌లో బాలుర అండర్-19 విభాగంలో కె.తరుణ్ టైటిల్ సాధించాడు. సికింద్రాబాద్‌లోని గుజరాతి సేవా మండల్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరిగిన ఈ పోటీల్లో బాలుర విభాగం ఫైనల్లో కె.తరుణ్ 3-2తో రిషబ్ సింగ్‌పై గెలిచాడు. బాలికల కేటగిరీ ఫైనల్లో పాలక్ గాయ్ 3-1తో శ్రీశాన్విపై నెగ్గింది. రాష్ట్ర టీటీ సంఘం మెంటర్ ప్రకాష్‌రాజ్, ప్రధాన కార్యదర్శి పి.నాగేందర్ రెడ్డి విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

నకిలీ గుర్తింపు కార్డుల తయారీ ముఠా అరెస్టు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలకు పాల్పడేందుకు నకిలీ గుర్తింపు కార్డులను తయారుచేస్తున్న ఓ ముఠాను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. సికింద్రాబాద్‌కు చెందిన ఎల్లం రాజ్‌కుమార్, ఆధార్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న ఎండీ మహబూబ్, పాస్‌పోర్టు ఏజెంట్ బండి శంకర్ కుమ్మక్కై మరో ముగ్గురు మిత్రులతో ముఠాగా ఏర్పడ్డారు. నకిలీ ఓటర్ ఐడీలను, ఆధార్‌లను, పాన్‌కార్డులను, బర్త్ సర్టిఫికెట్లను తదితర నకిలీ పత్రాలను తయారు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మహంకాళి పోలీసులు సికింద్రాబాద్ రెవెన్యూ అధికారులతో కలిసి దాడిచేశారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. వారిని విచారించిన క్రమంలో భారీస్థాయిలో ఆర్థిక మోసాలకు పాల్పడాలని కుట్ర చేసినట్లుగా గుర్తించారు. ఈ కేసును సీసీఎస్ పోలీసులకు అప్పగించారు. ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

సీతాఫల్‌మండి, వారాసిగూడలో నిత్యం ట్రాఫికర్

- భారీస్థాయిలో పెరిగిన వాహనాల సంఖ్య
- ఉదయం, సాయంత్రం సమస్య జటిలం

సీతాఫల్‌మండి, వారాసిగూడ చౌరస్తాల్లో ట్రాఫిక్ సమస్య నిత్యం వేధిస్తున్నది. ఉదయం స్కూల్స్, కాలేజీలకు, ఉద్యోగాలకు వెళ్లేవారికి, సాయంత్రం ఆఫీసుల నుంచి, ఇతర పనులు ముగించుకుని వచ్చే వారికి ట్రాఫిక్ చుక్కలు చూపిస్తున్నది. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

బౌద్ధనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి, వారాసిగూడచౌరస్తా మార్గాల్లో ఇటీవల వాహనాల సంఖ్య భారీస్థాయిలో పెరిగింది. గతంలో మూలమలుపుల వద్ద ట్రాఫిక్ సమస్య అంతరాయం ఏర్పడేది. ఇప్పుడు ప్రధానరహదారి ఎంబడి కూడా ట్రాఫిక్‌కు అవాంతారాలు ఏర్పడుతున్నాయి. ఆటోలు, ఇతర వాహనాలు ఎక్కడిపడితే అక్కడే నిలపడంతో సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సికింద్రాబాద్ నుంచి చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసిగూడ మీదుగా నగరంలోని వివిధ ప్రాంతాలకు రోజూ వేలసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే సీతాఫల్‌మండి, వారాసిగూడ చౌరస్తాల్లో మూలమలుపులు ఉండటం, ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు డ్రైవర్లు పలు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నా రోడ్డు ఇరుకుగా ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.



సీతాఫల్‌మండి చౌరస్తాలో ట్రాఫిక్‌జామ్

భారీవాహనాలతో ట్రాఫికర్

సీతాఫల్‌మండి, వారాసిగూడ చౌరస్తాల్లో ఉదయం, సాయంత్రం భారీవాహనాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. భవన నిర్మాణాలకు తరలించే ఇసుక, ఇటుక, సిమెంట్, ఐరన్ తదితర వస్తువులను తరలించే లారీలు, డీసీఎం వాహనాలతో పాటు రెడీమిక్స్ భారీ వాహనాలు వస్తున్నాయి. ఇవి ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా తరచూ రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వాహనాలతో స్కూల్స్‌కు, కాలేజీలకు వెళ్లే బస్సులు, ఆటోలు, మినీబస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. దీంతో వారు అనుకున్న సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వీరికి అప్పుడప్పుడు మీటింగ్‌లు పెట్టి కౌన్సెలింగ్ చేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. కొన్ని వాహనాలకు చలానాలు వేసి, సీజ్‌చేసినా సమస్య యథావిధిగా ఉంటుంది. ఇప్పటికే చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉండటంతో ట్రాఫిక్ సమస్యలను నివారించలేకపోతున్నారు. డ్రైవింగ్‌స్కూళ్లకు చెందిన వాహనాలను స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే సమయాల్లో ప్రధానరోడ్లపై తిప్పడంతో మరింత ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. సీతాఫల్‌మండి, వారాసిగూడ చౌరస్తాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రెడీమిక్స్ వాహనాలపై నిఘాపెట్టాలి

భవనాలకు స్లాబ్ వేసే రెడీమిక్స్ వాహనాలపై పోలీసులు నిఘాపెట్టాలని పలువురు కోరుతున్నారు. డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారని, దీంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపిస్తున్నారు. వారం రోజుల క్రితం క్రాంకీట్‌తో రెడీమిక్స్ వాహనం సీతాఫల్‌మండికు వచ్చింది. డ్రైవర్ మద్యంమత్తులో వావానాన్ని రోడ్డుపై నిలిపాడు. వాహనానికి హ్యాండ్‌బ్రేక్ వేయకపోవటంతో ముందుకు వెళ్లిన రెడీమిక్ లారీ, కారు, ఆటోలతోపాటు ద్విచక్రవాహనాలను ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. రెడీమిక్స్ వాహన యాజమాని ధ్వంసమైన వాహనాల యాజమానులతో మాట్లాడి అన్ని మరమ్మతులు చేయిస్తానని తెలపటంతో వివాదం సద్దుమణిగింది. భారీవాహన డ్రైవర్లు, ఆటోడ్రైవర్లు గంజాయి, మద్యం తాగి డ్రైవింగ్ చేస్తుండడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫొటో స్టూడియో వద్ద తరచూ ప్రమాదాలు

సీతాఫల్‌మండి చౌరస్తాకు కొద్దిదూరంలో ఉన్న ఓ ఫొటో స్టూడియో ఎదుట తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంబేడ్కర్ బొమ్మ పక్క రోడ్డు నుంచి వచ్చే వాహనాలు, సీతాఫల్‌మండి నుంచి వారాసిగూడ వెళ్లే వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో పలు ద్విచక్రవాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అంబేడ్కర్ బొమ్మ వద్ద ఉన్న రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తే వాహనాల ప్రమాదాలను నివారించవచ్చునని స్థానికులు తెలుపుతున్నారు. ట్రాఫిక్, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు



సీతాఫల్‌మండి, వారాసిగూడ చౌరస్తాల్లో ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు చేపట్టాం. సీతాఫల్‌మండి నుంచి చిలకలగూడ చౌరస్తా వరకు ప్రధానరోడ్డుకు ఆనుకుని పైపులైన్ మరమ్మతులు జరుగుతుండడంతో కొద్దిగా ట్రాఫిక్ సమస్య ఉంది. ఈ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నాం. ఉదయం, సాయంత్రం భారీ వాహనాలకు, రెడీమిక్స్ వాహనాలకు అనుమతులులేవు. ఆటోలు, ఇతరవాహనాలను రోడ్లమీద పార్కింగ్ చేసిన వారిపై తగినచర్యలు తీసుకుంటాం.

- సీహెచ్.శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్, చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్



ప్రజాసమస్యలను అడిగితెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : శ్రీగణేష్

మారేడుపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించడమే ధ్యేయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం కంటోన్మెంట్ బోర్డుఐదో వార్డ్ పరిధిలోని 108 బజార్ బస్తీలో ఆయన పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నోఏళ్లుగా నివాసముంటున్నా తమకు సరైన తాగునీటి వసతిలేదని 4 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా జరుగుతోందని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి వసతితో పాటు కనీస అవసరాలకు బోర్‌వెల్‌వేసి నీటిసౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అటాగే కరోనా కాలంలో భద్రతా కారణాల వల్ల మూసివేసిన 1, 3, నెంబర్ గేట్లు తెరిపించాలని, డ్రైనేజీ వ్యవస్థను, స్ట్రీట్‌లైట్స్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ... వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తేలుకుంట సతీష్ గుప్తా, బస్తీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తున్నా : ఎమ్మెల్యే

తిరుమలగిరి డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్నానని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం తిరుమలగిరి దినకర్ కాలనీలో పవర్ బోర్‌వెల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుమలగిరి పరిసర ప్రాంతాల్లో నీటిసమస్య లేకుండా చర్యలు చేపట్టామన్నారు. బస్తీవాసుల సౌకర్యార్థం కమ్యూనిటీహాల్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ బోరవెల్ ద్వారా దినకర్ కాలనీలోని నీటిసమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మురళి ముదిరాజ్, రంగా రవీందర్ గుప్తా, రామ్, నాగసేని సరిత, భవాని, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి వినియోగదారుల అరెస్ట్

యూసుఫ్‌గూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బీకేగూడ ఎల్ఐసీ కాలనీకి చెందిన ఎస్.వివేక్‌గౌడ్ (21), వెంగళరావు నగర్‌కు చెందిన ఎండీ మహబూబ్ ఆలీ సాబేర్ (22) ఆదివారం రాత్రి సిద్దార్థనగర్‌లోని ఆల్ఫాన్సా స్కూల్ సమీపంలో గంజాయి తాగుతున్నారు. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా గంజాయి తాగుతున్నట్లు తేలింది. ఫతేనగర్‌లో రూ.400లకు గంజాయి కొనుగోలు చేసినట్లు వారు వెల్లడిచారు. వారి వద్ద ఉన్న గంజాయి, ఫోన్‌లను స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న బస్తీవాసులు, బీజేపీ నేతలు

అంగన్‌వాడీ పక్కనే ట్రాన్స్‌ఫార్మర్

- తొలగించాలని బీజేపీ నాయకులు, బస్తీవాసుల వినతి

అడ్డగుట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ బడికి ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తొలగించాలని బీజేపీ మహంకాళి జిల్లా కిషాన్ మోర్చా అధ్యక్షుడు సీహెచ్ కన్నాభిరాం, స్వామి, శివలింగం, రవీందర్‌తో పాటు బస్తీ కమిటీ సభ్యులు శ్యామ్, శ్రీనివాస్, శ్రీకాంత్, శివకుమార్, భిక్షపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారందరూ సోమవారం గాంధీ ఆస్పత్రి పక్కనే ఉన్న విద్యుత్ డీఈ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. తుకారాంగేట్ రియో పాయింట్ హోటల్ ఎదురుగా గల్లీలో అంగన్‌వాడీ స్కూలుకు ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదంగా ఉంది. దీనికి చుట్టూ కంచె లేకుండా ఉండడంతో బడికి వచ్చే చిన్నారులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాట్‌సర్క్యూట్‌తో పెద్దపెద్ద మంటలు రావడంతో విద్యుత్ పరికరాలు, మీటర్లు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఈ క్రమంలో బడికి ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వల్ల వడ్డెరబస్తీ వాసులు, బడికి వచ్చే పిల్లలు భయానికి గురవుతున్నారు. వెంటనే ఈ సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులను కోరారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి బడికి దూరంగా ఉన్న పార్కులో ఏర్పాటు చేయాలని కోరారు.



అంగన్‌వాడీ స్కూల్‌కు ఆనుకుని, ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో హమాలీలు, గుమాస్తాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు

గంజాయి, డ్రగ్స్ అమ్మితే సమాచారం ఇవ్వండి : కార్ఖాన ఏసీపీ

బోయిన్‌పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు లోపల బయట గంజాయి, డ్రగ్స్ అమ్మేవారు, వాడుతున్న వారిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని కార్ఖాన ఏసీపీ రమేష్ వెల్లడించారు. కొంతకాలంగా బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డులో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు గంజాయి, డ్రగ్స్ అమ్ముతున్నారని తెలిసిందన్నారు. వాటిని మార్కెట్ యార్డు చుట్టుపక్కల వారు కొనుగోలుచేసి మార్కెట్ యార్డులో సాయంత్రం రాత్రి సమయాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం కార్ఖాన ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డు పరిసరాలను తమ సిబ్బందితో పరిశీలించి, పలువురిని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గంజాయి అమ్మేవారు, కొనేవారి వివరాలు తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం తెలియజేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి అమ్మేవారు, కొనేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, పీడీయాక్ట్ సైతం నమోదు చేస్తామని హెచ్చరించారు.



ఉజ్జయినీ మహంకాళి ఆలయ హుండీలలోని డబ్బును లెక్కిస్తున్న అధికారులు తదితరులు

మహంకాళి ఆదాయం రూ.34,12,321

సికింద్రాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ అధికారులు, పోలీసులు, భక్తుల సమక్షంలో సోమవారం సికింద్రాబాద్ ఉజ్జయినీమహంకాళి దేవస్థానం హుండీలను లెక్కించారు. 112 రోజులకు గాను రూ.34,12,321 వచ్చాయి. కాగా నోట్ల రూపంలో రూ.32లక్షల 67,654, నాణేల రూపంలో రూ.1,44,667 వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఆలయ ఫౌండర్ ట్రస్టీ, ఫ్యామిలీ మెంబర్ సురిటి రామేశ్వర్, మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గడీలమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బోయిన్‌పల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి, చిన్నతోకట్టలో నూతనంగా నిర్మించిన గడీల మైసమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ వేడుకలను స్థానిక భక్తుడు, ఆలయ వ్యవస్థాపకుడు కొండల్‌యాదవ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నారు. మొదటిరోజు గణపతిపూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహాల పూజలు, మండప స్థాపన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొండల్‌యాదవ్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు ముఖేష్ యాదవ్, అరుణ్, జాజుల క్రాంతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంట్లో చోరీ

యూసుఫ్‌గూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఊరు వెళ్లి వచ్చేలోపు ఇంట్లో చోరీ జరిగిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సిద్ధార్థనగర్‌లో ఉంటున్న కె.గణేష్ గతనెల 12న భార్య ప్రసవించింది. దీంతో కుమారుడితో కలిసి కాకినాడ వెళ్లాడు. ఈనెల 1వ తేదీన ఉదయం తిరిగొచ్చాడు. ఇంట్లో బీరువా పగులగొట్టి ఉంది. అందులో పట్టీలు, కుంకుమ భరణిలు, పిల్లల ప్లేట్లు మొత్తం రూ.50 వేల విలువ చేసే వస్తువులు కనిపించలేదు. దీంతో మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితురాలి పేరుతో మెసేజ్ చేసి రూ.25 వేలు కాజేత

బంజారాహిల్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డబ్బు అవసరం ఉందంటూ స్నేహితురాలి పేరుతో మెసేజ్ చేసి సైబర్ నేరగాళ్లు రూ.25 వేలు కాజేశారు. శ్రీనగర్‌కాలనీకి చెందిన రుబేల్ అగర్వాల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. గతనెల 13వ తేదీన స్నేహితురాలు స్వాతి పేరుతో ఓ మెసేజ్ వచ్చింది. రూ.35 వేలు కావాలని తాను చెప్పిన నంబర్‌కు పంపించాలని కోరడంతో రుబేల్ అగర్వాల్ మొదట రూ.25 వేలను పంపించాడు. కొద్ది సేపటికి అదే నంబర్ నుంచి అతడి ఫోన్‌హ్యాక్ అయిందని మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయినట్టు గ్రహించిన రుబేల్ సైబర్‌వింగ్‌కు ఆన్‌లైన్‌లో సమాచారం ఇచ్చాడు. అనంతరం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఫుట్‌పాత్ ఆక్రమణల తొలిగింపును పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ డీసీపీ సుస్మిత



ఎక్స్‌కవేటర్‌తో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

రెజిమెంటల్‌బజార్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు చేస్తు పాదచారులకు అసౌకర్యం కలిగించే వారిపై చర్యలు ఉంటాయని జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ డీసీపీ సుస్మిత అన్నారు. సోమవారం టౌన్‌ప్లానింగ్, గోపాలపురం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కూల్చివేతను డీసీపీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ..వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ అక్రమ నిర్మాణాలను తొలిగించామని తెలిపారు. క్లాక్‌టవర్ నుంచి ప్రారంభమైన అక్రమ తొలిగింపులు స్టేషన్ రోడ్డు మీదుగా మదర్ థెరిసా విగ్రహం వరకు సాగింది.

ఈ కార్యక్రమంలో ఏసీపీలు సుబ్బయ్య, శంకర్ రాజు, ఇన్‌స్పెక్టర్లు నరేష్, గోపాలపురం, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరాములు, శంకర్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది ప్రకాశ్, సెక్షన్ ఆఫీసర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.